షేర్లను ఒడిసిపట్టేద్దాం

ఐపీవో అలాట్‌మెంట్‌లో మీకున్న అవకాశాల్ని పెంచుకోండిలా

స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులపట్ల ఆసక్తి ఉన్న మదుపరులకు ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) ఎప్పుడూ అత్యంత ప్రాధాన్యతగల అంశమే. ఎందుకంటే ఈ ఆఫర్లు అనేకానేక ప్రయోజనాలను కలిగి ఉంటాయి. అయినప్పటికీ పెద్ద ఎత్తున డిమాండ్ కారణంగా ఈ పబ్లిక్ ఇష్యూల్లో షేర్లను దక్కించుకోలేకపోతుంటారు చాలామంది. అందుకే కొన్నిరకాల మార్గాల్లో ప్రయత్నిస్తే మదుపరులు తాముల అనుకున్నది సాధించవచ్చు.

ఇదీ సంగతి..

దేశీయ స్టాక్ మార్కెట్లు రోజుకో రికార్డు స్థాయిని తాకుతున్నాయి. ఒకప్పుడు స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్ట్‌మెంట్‌పట్ల పెద్దగా ఆసక్తి చూపనివారే ఎక్కువ. కానీ ఇప్పుడు అంతా అమితాసక్తిని ప్రదర్శిస్తున్నారు. ఈక్విటీ పెట్టుబడులపై పెరిగిన అవగాహనే ఇందుకు కారణం. ఇక ఏదైనా సంస్థ ఐపీవోకు వచ్చినప్పుడు అందులో షేర్లను కొనాలనుకుంటే మీ కుటుంబ సభ్యులందరి పేర్లపైనా దరఖాస్తు చేసుకోవాలి. గడువులోగా ఈ పని పూర్తిచేయాలి. ఇతరత్రా విషయాలకొస్తే..

బహుళ డీమ్యాట్ అకౌంట్లతో

ఒకటికి మించి డీమ్యాట్ అకౌంట్ల ద్వారా పలుమార్లు దరఖాస్తు చేసుకోవడం వల్ల కూడా షేర్లను పొందవచ్చు. మీ కుటుంబ సభ్యుల పేరిట ఉన్న డీమ్యాట్ ఖాతాలను ఇందుకు వాడుకోండి. దీనివల్ల రష్ ఎక్కువగా ఉన్నప్పటికీ దేనికో ఒకదానికి మీ షేర్ల అలాట్‌మెంట్ జరుగుతుంది. అయితే దరఖాస్తు సమయంలో మీకున్న అన్ని డీమ్యాట్ ఖాతాల వివరాలను పేర్కొనడం తప్పనిసరి.

ఆఖరుదాకా ఆగవద్దు

ఐపీవో వచ్చినప్పుడు గంటల వ్యవధిలోనే రష్ పెరుగుతూ ఉంటుంది. కాబట్టి సమయం ఉన్నదికదా అని ఆఖరు గంటదాకా వేచిచూడవద్దు. చాలావరకు ఐపీవోలు 2 నుంచి 5 రోజుల వ్యవధితో పబ్లిక్ ఇష్యూలకు వస్తూంటాయి. తొలిరోజే దరఖాస్తు చేసుకోవడం ఉత్తమం. రోజులు గడుస్తున్నకొద్దీ సర్వర్లు హ్యాంగైపోవచ్చు. దీనివల్ల మీ దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యే ప్రమాదం ఉంటుంది.

సాంకేతిక సమస్యలపై..

దరఖాస్తు ఫారాల్లో బ్యాంక్/డీమ్యాట్ ఖాతాలు, ఇతరత్రా వివరాలను తప్పుగా పేర్కొనవద్దు. ఒకటికి రెండుసార్లు పరిశీలించి సరైన వివరాలనే ఇవ్వాలి. లేదంటే మీ అప్లికేషన్లు తిరస్కరణకు గురవుతాయి. ఐపీవోల్లో చాలావరకు బిడ్లు ఇలానే పోతుంటాయి.

మాతృ సంస్థలకు మద్దతుగా

మాతృ సంస్థల్లో మీకు షేర్లున్నట్లైతే వాటి అనుబంధ కంపెనీలు ఐపీవోలకు వచ్చినప్పుడు తప్పక దరఖాస్తు చేసుకోండి. మీ విశ్వసనీయత, దీర్ఘకాలిక అంకితభావం కారణంగా షేర్ల కేటాయింపుల్లో మీకు తొలి ప్రాధాన్యత దక్కగలదు. ఉదాహరణకు ఆర్ఐఎల్‌లో మీకు షేర్లున్నట్లైతే ఆ సంస్థకు అనుబంధంగా ఉన్న రిలయన్స్ జియో, రిలయన్స్ ఫ్రెష్, రిలయన్స్ జ్యుయెల్లర్స్ సంస్థలు ఐపీవోలకు వస్తే వాటి కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు మీకు మొదటి ప్రాధాన్యత ఉంటుంది.

చివరగా..

ప్రస్తుతం ఐపీవో మార్కెట్ సందడిగా ఉన్నది. అనేక రంగాల్లోని కంపెనీలు, స్టార్టప్‌లు నిధుల సమీకరణ కోసం పబ్లిక్ ఇష్యూకు వస్తున్నాయి. కాబట్టి ఈక్విటీ మార్కెట్లలో మదుపుపై ఆసక్తి ఉన్నవారు పెద్దపెద్ద సంస్థలను కాకుండా.. చిన్నచిన్న సంస్థలను ఎంచుకొంటే లాభదాయకం. నష్టాలు వాటిల్లినా పెద్దగా అవి మన పెట్టుబడులకున్న అవకాశాల్ని దెబ్బతీయవు.

గరిష్ఠ ధరకే బిడ్డింగ్

ఐపీవోల్లో షేర్ల ధరల శ్రేణిని గమనించే ఉంటారు. రూ.70-75, రూ.150-160, రూ.500-515 ఇలా రకరకాల బ్యాండ్లలో ఈ ధరలను ప్రకటిస్తారు. ఇందులో మీరు గరిష్ఠ ధరలకు బిడ్డింగ్ చేసినప్పుడే మీకు షేర్లను దక్కించుకోవడానికి ఎక్కువ అవకాశాలుంటాయి. ఉదాహరణకు ఐపీవో ప్రైస్ బ్యాండ్ రూ.92-97 మధ్య ఉన్నది. అప్పుడు రూ.97కు షేర్లను కొంటామని మీరు బిడ్లను దాఖలు చేయాలి. తొలి ప్రాధాన్యతగా మిమ్మల్ని పరిగణిస్తారు.

ఒక్క లాట్‌కే దరఖాస్తు

ఐపీవోలో అలాట్‌మెంట్ దక్కాలంటే సింగిల్ లాట్‌కే దరఖాస్తు చేసుకోవడం ఉత్తమం. అప్పుడే మీకున్న అవకాశాలు పెరుగుతాయి. సాధారణంగా చిన్న రిటైల్ మదుపరులను ప్రోత్సహించడానికి అలాట్‌మెంట్లలో వారికి తగిన ప్రాధాన్యాన్నిస్తారు. కనుక ఒక్క లాట్‌లోనే దరఖాస్తు చేసుకున్నవారికి ప్రయోజనం ఉంటుంది. ఒక్కో లాట్‌లో సాధారణంగా 100 షేర్లుంటాయి.

ఆర్థిక లక్ష్యాలకు అవరోధాలివే..

ప్రతీ ఒక్కరికీ వారివారి ఆర్థిక లక్ష్యాల సాధనకు నగదే ప్రధానం. కానీ ఆ నగదు పొదుపు విషయంలో అనేక అడ్డంకులు వస్తున్నాయి. అందుకే పట్టుదల, క్రమశిక్షణ, సరైన వ్యూహాలుండాలి. అప్పుడే ఫైనాన్షియల్ గోల్స్ సాకారం కాగలవు. అసలు ఆర్థిక లక్ష్యాల సాధనను ఏవి పక్కదారి పట్టిస్తున్నాయో చూస్తే..



క్రమశిక్షణారాహిత్యం

క్రమశిక్షణ లేకపోవడం వల్ల ఆర్థిక లక్ష్యాల సాధన జటిలంగా మారుతుంది. ఉదాహరణకు మార్కెట్‌లో కొత్త స్మార్ట్‌ఫోన్ కనిపించిందని, ఇప్పుడున్న ఫోన్ బాగున్నా కొనేయడం అక్షరాలా దుబారానే. అలాగే అనవసరపు టూర్లతోనూ లేనిపోని ఖర్చే. ఇలాంటివన్నీ చాపకింద నీరులా మీ ఆర్థిక లక్ష్యాలను దెబ్బతీస్తాయని మరువద్దు.

ద్రవ్యోల్బణం

ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకొని మన ఆదాయాలను పెంచుకుంటూపోవాలి. లేకపోతే మన సంపాదన, పొదుపును పెరిగే ధరలు మింగేస్తాయి. అది పిల్లల చదువుకయ్యే ఖర్చులు కావచ్చు లేదా మనం కొనాలనుకునే ఇల్లు కావచ్చు ఏదైనాసరే రోజులు గడుస్తున్న కొద్దీ మరింత ఎక్కువగా నగదును పెట్టాల్సి వస్తుందని మరువద్దు.

అత్యవసరాలు

జీవితంలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించలేం. ముఖ్యంగా వైద్యవసరాలు ఎలా ఉంటాయో కూడా తెలియదు. అనుకోని ఆరోగ్య సమస్యలతో కూడా ఆర్థిక లక్ష్యాలు దెబ్బతింటాయి.

మార్కెట్ ఒడిదొడుకులు

మార్కెట్‌లో నెలకొనే ఒడిదొడుకులు కూడా ఆర్థిక లక్ష్యాలకు ఆటంకమే. పెట్టిన పెట్టుబడుల్లో రాబడులు తగ్గి అనుకున్న స్థాయిలో నగదు సమీకరణలు కష్టమవుతాయి. కాబట్టి మన చేతిలో లేనివాటికి మనం ఏమీ చేయలేం. ఉన్నవాటికైనా జాగ్రత్తతో ముందుకెళ్తే అనుకున్నది సాధిస్తాం.

మదుపర్లూ అప్రమత్తత అవసరం

మార్కెట్ పల్స్

దేశీయ స్టాక్ మార్కెట్లు ఆల్‌టైమ్ హైల్లో కదలాడుతున్నాయి. మదుపరులు పెట్టుబడులకే పెద్దపీట వేస్తున్నారు. గత వారం ట్రేడింగ్‌లో శుక్రవారం ఒక్కరోజే సెన్సెక్స్ 1,360, నిఫ్టీ 375 పాయింట్లు పెరిగాయి. ఈ క్రమంలోనే వారం మొత్తంగా సూచీలు భారీగానే ఎగిశాయి. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,653.37 పాయింట్లు ఎగబాకి తొలిసారి 84వేల మార్కును దాటి ఆల్‌టైమ్ హై 84,544.31 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 434.45 పాయింట్లు ఎగిసి మునుపెన్నడూ లేనివిధంగా 25,790.95 దగ్గర ముగిసింది. ఈ నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందంటూ మెజారిటీ నిపుణులు సూచిస్తున్నారు. సూచీలు ఆల్‌టైమ్ హైల్లో ఉన్న విషయాన్ని వారు గుర్తుచేస్తున్నారు. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 25,400 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 25,200 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 26వేల మార్కును నిఫ్టీ తాకవచ్చు. 26,100-26,400 మధ్యకు వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.



చివరగా..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

ఇంటికీ బీమా రక్షణ

గృహమే కదా స్వర్గసీమ అన్నారు పెద్దలు. మరి ఆ ఇంటికీ రక్షణ ఉండాలి కదా. అందుకే ఇండ్లకూ ఇన్సూరెన్స్‌లొచ్చేశాయ్. గృహ బీమాను ప్రాపర్టీ ఇన్సూరెన్స్ లేదా హోమ్ ఓనర్ ఇన్సూరెన్స్‌గా కూడా పిలుస్తారు. ఎక్స్‌టీరియర్-ఇంటీరియర్ డ్యామేజీలకు కవరేజీనిస్తుంది. ఇంట్లోని వస్తుసామాగ్రికి కూడా బీమా రక్షణ లభిస్తుంది. ఇంట్లో దురదృష్టవశాత్తూ జరిగే ఏదైనా ప్రమాదాలకూ వర్తిస్తుంది. హోమ్ ఇన్సూరెన్స్ సదుపాయాన్ని ఎస్బీఐ, శ్రీరామ్ జనరల్, బజాజ్ అలియాంజ్, భారతీ యాక్సా, రాయల్ సుందరం, రిలయన్స్, రహేజా క్యూబీఈ, ఓరియంటల్, న్యూ ఇండియా అష్యూరెన్స్, నేషనల్ ఇన్సూరెన్స్, ఫ్యూచర్ జనరాలీ, చోళమండలం వంటి సంస్థలు అందిస్తున్నాయి. ఇండ్ల యజమానులు, అద్దెకుండేవారు ఈ బీమాను తీసుకోవచ్చు. కొన్ని సంస్థలు హౌజింగ్ సొసైటీలకూ బీమాను కల్పిస్తున్నాయి. తీవ్రవాదులు దాడి, భూకంపాల్లో ధ్వంసమైనా బీమాను ఇస్తామని మరికొన్ని సంస్థలు ప్రకటిస్తున్నాయి.

కవరేజీ ఇలా..

షరతులు, ప్రీమియంలనుబట్టి ఆయా సంస్థలు.. అగ్ని ప్రమాదాలు, డాక్యుమెంట్ల నష్టం, దొంగతనాలు, గృహోపకరణాల డ్యామేజీ, వ్యక్తిగత ప్రమాద బీమా, అద్దె ఎగవేత, పెంపుడు జంతువుల సంరక్షణ, ఇల్లు పూర్తిగా దెబ్బతింటే ప్రత్యామ్నాయ వసతి ఖర్చులు, బ్యాగేజీ నష్టం, థర్డ్ పార్టీ-ఎంప్లాయ్ లయబిలిటీస్, ఎలక్ట్రికల్ ఫెయిల్యూర్ కవరేజీలను అందిస్తున్నాయి. ఇంట్లోని విలువైన ఎలక్ట్రిక్-ఎలక్ట్రానిక్ వస్తువులు, ఫర్నీచర్, ఆభరణాలకూ బీమా కవరేజీ ఉంటుంది. ప్రకృతి విపత్తుల్లో ధ్వంసమైనా, అల్లర్లతో ప్రభావితమైనా ఇన్సూరెన్స్‌ను పొందవచ్చు. ఒకవేళ గృహ రుణం పరిధిలో ఇల్లు ఉన్నట్లైతే ప్రీమియంలు అధికంగా ఉంటాయి.

పాలసీ కాలపరిమితి

గృహ బీమా పాలసీలు దీర్ఘకాలానికిగాను కొనుక్కోవచ్చు. అలాగే కనిష్టంగా ఏడాది కాల పరిమితితో కూడా తీసుకోవచ్చు. ఇండిపెండెంట్ హౌజ్‌లు, అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లకు అనుగుణంగా ఈ పాలసీల కవరేజీని ఎంచుకోవచ్చు. నివాస ప్రాంతాన్నిబట్టి, పాలసీ వ్యవధి ఆధారంగా ప్రీమియంలుంటాయి. అయితే వాటిల్లిన నష్టానికి కారణం ఉద్దేశపూర్వక చర్యేనని తేలితే బీమా వర్తించదు.

సాగర్ కాలువకు మరమ్మతులు చేయాలి

పాలేరు కాలువను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కూసుమంచి, సెప్టెంబర్ 22: పాలేరు వద్ద సాగర్ ఎడమ కాలువపై పడిన గండిని సాంకేతికతను ఉపయోగించి మరమ్మతులు చేయాలని, రైతులకు సాగర్ జలాలను ఇవ్వాలని సీపీఎం అనుబంధ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బొంతు రాంబాబు అన్నారు. ఆదివారం కాలువపై పడిన గండిని, యూటీ వద్ద కూలిన వాల్ ప్రాంతాన్ని సీపీఎం నాయకులతో కలిసి పరిశీలించారు. రాంబాబు మాట్లాడుతూ వారం రోజులుగా రైతులు సాగు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని, వారిని ఆదుకోకపోతే పంటలకు నష్టం కలిగే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు మాదినేని రమేశ్, తాతా భాస్కర్‌రావు, గోవర్ధన నాగేశ్వరరావు, మీరా, ఎడవల్లి రమణారెడ్డి, రైతు సంఘం మండల అధ్యక్షుడు తోటకూరి రాజశేఖర్, గంగాధర్, మల్లెల షన్మతరావు, ఇంటూరి అశోక్, ఏటుకూరి రామారావు, గోవింద్, కర్ణబాబు పాల్గొన్నారు.

సాగర్ కాలువ మరమ్మతుల్లో జాప్యం తగదు : బీజేపీ

కూసుమంచి, సెప్టెంబర్ 22: సాగర్ కాలువ మరమ్మతుల విషయంలో జాప్యం తగదని, ఒక పక్క మరమ్మత్తులు చేస్తుంటానే మరో పక్క లీక్ అవుతుందని ఈవిషయంలో అధికారులు చర్యలు తీసుకోని రైతులకు సకాలంలో నీటిని ఇవ్వాలని బీజేపీ నాయకులు నున్నా రవికుమార్ అన్నారు. మండలంలోని పాలేరు రిజర్వాయర్ వద్ద ఎడమ కాలువకు పడిన గండిని పరిశీలించారు. కాలువ మరమ్మతుల విషయంలో గుత్తేదారుపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం వెంకటేశ్వర్లు, మన్నెం నాగేశ్వరరావు, నరేశ్, ఉపేందర్‌రెడ్డి, మహేందర్, వెంకటేశ్వర్లు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు

కలెక్టర్ దృష్టికి కాలనీ సమస్యలు

కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న కొత్వాల

పాల్వంచ రూరల్, సెప్టెంబర్ 22: పాల్వంచ నవభారత్ సమీపంలోని బృందావన్ కాలనీ వాసుల సమస్యలను కలెక్టర్ జితేష్ వి.పాటిల్ దృష్టికి మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు తీసుకెళ్లారు. శ్రీనివాస కాలనీలో టెన్నిస్ టోర్నమెంటులో పాల్గొనేందుకు వచ్చిన కలెక్టర్‌ను బృందావన్ కాలనీ వాసులతోపాటు కలిసి సమస్యలను వివరించారు. డ్రైనేజీ ఆక్రమణతో మురుగు నీరు బయటకు వెళ్లడం లేదని చెప్పారు. ఇతరత్రా సమస్యలను వివరించి, పరిష్కరించాలని కోరారు.

కష్ట జీవుల పక్షాన నిలబడాలి

కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 22: దేశంలోని కోట్లాది మంది శ్రమ జీవులపై సాగుతున్న దోపిడీకి, పీడనకు వ్యతిరేకంగా కళాకారులు నిలబడాలని ఆరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వేణు కోరారు. కొత్తగూడెంలోని ఇప్టా కార్యాలయంలో ఆదివారం కళాకారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు సీతారామయ్య, మెంతిన కొండలరావు, వీరమల్ల సురేష్‌కుమార్, నర్సింగ్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం

వరలక్ష్మిని సన్మానిస్తున్న స్థానికులు

లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబర్ 22: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఈ నెల 5న అవార్డు అందుకున్న మండలంలోని లక్ష్మీదేవిపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మిని గ్రామస్తులు సన్మానించారు. మాజీ ప్రజాప్రతినిధులు తాటి లక్ష్మి, భద్రమ్మ, పాయమ్మ, కృష్ణవేణి, హైస్కూల్ హెచ్ఎం కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వర్షమొస్తే ప్రాణసంకటమే..

- శ్రీరాంపురం ఎస్టీ కాలనీని వెంటాడుతున్న రవాణా సమస్య
- బురద రోడ్డును దాటేలోపే మృత్యువాత పడిన వారూ ఎందరో..

పసికందును వైద్యం కోసం బురద రోడ్డులో తీసుకెళ్తున్న కన్నతల్లి (ఫైల్)

శ్రీరాంపురం ఎస్టీ కాలనీ నుంచి బురదలోనే రోగిని మోసుకొని వస్తున్న గిరిజన యువకులు

సారపాక, సెప్టెంబర్ 22: పారిశ్రామిక కేంద్రమైన సారపాకకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీరాంపురం ఎస్టీ కాలనీని రవాణా సమస్య వెంటాడుతోంది. కొద్దిపాటి వర్షం వచ్చినా ఆ కాలనీవాసులకు అవస్థ తప్పడంలేదు. జ్వరమొచ్చినా, విషసర్పాలు కాటేసినా, వ్యాధులు సంభవించినా వారిని వైద్యం కోసం మోకాల్లోతు బురదలో కావడి కట్టుకుని ప్రధాన రహదారికి తీసుకురావాల్సిందే. వారిని తీసుకువచ్చే క్రమంలో ఒక నిమిషం ఆలస్యమైనా ప్రాణాలు గాలిలో కలిసినట్లే.

వర్షమొస్తే ఆ దారిలో నరకప్రాయమే...

సారపాక పంచాయతీలోని శ్రీరాంపురం ఎస్టీ కాలనీలో 65 కుటుంబాలున్నాయి. 300 మంది కిపైగా అక్కడి నివసిస్తున్నారు. ఆ కాలనీలో కనీసం అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం, ప్రైమరీ పాఠశాల కానీ లేవు. శ్రీరాంపురం ఎస్టీ కాలనీ నుంచి సారపాక ప్రధాన రహదారి రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. వర్షాకాలం సమీపిస్తే ఈ కాలనీ వాసులకు ప్రాణసంకటం మొదలైనట్లే. కాలనీలో ఎవరికైనా అత్యవసర చికిత్స అందించాల్సి వస్తే.. వారిని కావడిపై మోసుకుంటూ రెండు కిలోమీటర్ల మేర మోకాల్లోతు బురదలో నడుచుకుంటూ ప్రధాన రహదారికి చేర్చాల్సి వస్తోంది. సమయానికి వైద్యం అందని కారణంగా ఇప్పటికే ఈ గ్రామంలో కొన్నేళ్ల క్రితం కొందరు వృద్ధులు మృత్యువాత పడిన విషయం విదితమే. శ్యామల వెంకటేశ్, రత్తమ్మ దంపతుల నాలుగు నెలల పసికందు కూడా రెండేళ్ల క్రితం ఇదే బురదలో తీసుకొస్తుండగా మధ్యలోనే ప్రాణాలు విడిచింది. వెట్టి సమ్మయ్య భార్య రాధ పాముకాటు కారణంగా ఏడాది క్రితం మృతిచెందింది. మూర్ఛ కారణంగా స్పృహ కోల్పోయిన కొర్సా లక్ష్మి అనే గిరిజన మహిళను కాలనీ యువకులు మోకలి లోతు బురదలో అతి కష్టమ్మీద బయటకు తీసుకొచ్చి ఆసుపత్రికి పంపించారు.

వృద్ధురాలిని కావడిపై మోసుకొస్తున్న గిరిజనులు (ఫైల్)

బాలిక మొఖంపై యువకుడి పిడిగుద్దులు

- 'వినాయకుడి' వద్దకు తన చెల్లిని ఎందుకు తీసుకొచ్చావంటూ ఘాతుకం
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన.. పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు..

భద్రాచలం, సెప్టెంబర్ 22: తన చెల్లిని వినాయకుడి మండపం వద్దకు ఎందుకు తీసుకొచ్చావంటూ ఆగ్రహించిన ఓ యువకుడు ఓ బాలిక మొఖంపై పిడిగుద్దులు గుద్దాడు. కొద్దిసేపటికి అపస్మారస్థితిలోకి వెళ్లిన ఆ బాలిక.. చికిత్స అనంతరం కోలుకున్నది. ఈ ఘటనపై స్థానిక సోషల్ మీడియాలో ఆమె పెట్టిన వీడియో వైరల్ అయింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు కూడా నమోదైంది. బాధిత బాలిక పోస్టు చేసిన వీడియోలోని కథనం ప్రకారం.. భద్రాచలం ఆదర్శనగర్ కాలనీకి చెందిన బాధిత బాలిక, మరో బాలిక కలిసి ఈ నెల 20న అదే ప్రాంతంలోని వినాయకుడి మండపం వద్దకు వెళ్లారు. అప్పటికే అదే మండపం వద్ద ఉన్న మరో బాలిక సోదరుడైన యువకుడు వారిని చూశాడు. ఈ బాలికలు కూడా ఆ యువకుడిని గమనించారు. ఆ యువకుడి సోదరి అక్కడి నుంచి వెళ్లిపోగా.. బాధిత బాలిక ఆ పక్కనే ఉన్న కిరాణా దుకాణం వద్ద ఆగింది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న ఆ యువకుడు ఆ బాలిక దగ్గరకు వచ్చాడు. తన చెల్లిని ఎందుకు తీసుకొచ్చావంటూ ఆమె మొఖంపై పిడిగుద్దులు గుద్దాడు. వెంటనే తన ఇంటికి వెళ్లిన బాధిత బాలికకు ఒక్కసారిగా మూర్ఛలు రావడంతో కిందపడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఆమె తల్లిదండ్రులు ఆ బాలికకు తొలుత భద్రాచలంలో ప్రాథమిక వైద్యం, ఆ తరువాత ఖమ్మంలో మెరుగైన వైద్యం అందించారు. బాలిక కోలుకోవడంతో ఆదివారం ఉదయం తిరిగి భద్రాచలం చేరుకుంది. తనపై జరిగిన దాడి గురించి సోషల్ మీడియాలో పోస్టు పెట్టింది. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ పీవీ ఎన్ రావు కేసు నమోదు చేశారు.

జమిలి ఎన్నికలపై చర్చావేదిక

చర్చా వేదికలో మాట్లాడుతున్న రాజకీయ నాయకులు

అశ్వారావుపేట టౌన్, సెప్టెంబర్ 22: కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న జమిలి ఎన్నికల ప్రస్తావనపై స్థానిక మీడియా క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బాలురు జిల్లా పరిషత్ హైస్కూల్లో చర్చా వేదిక నిర్వహించారు. సీనియర్ జర్నలిస్టు పాశం రామారావు, ప్రముఖ కవి డా.సిద్ధాంతపు ప్రభాకారాచార్యులు అధ్యక్షతన జరిగిన చర్చా వేదికలో పలువురు మేధావులు, రాజకీయ నాయకులు మాట్లాడారు. జమిలీ ఎన్నికల నిర్వహణ తలకు మించిన భారమేనని, ఎన్నికల ఖర్చు తగ్గించుకోవడం ఏమోగానీ నష్టం ఎక్కువగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగంలో జమిలి ఎన్నికల అంశం లేదని మరొకరు వాదించారు. జమిలీ ఎన్నికలను ఎక్కువ మంది వ్యతిరేకించినా ఎన్నికలు జరిగితే మంచే జరుగుతుందని పలువురు మేధావులు వివరించారు. రామ్‌నాథ్ కోవింద్ కమిటీ ఏడు దేశాల్లో పర్యటించి అధ్యయనం చేసి కేంద్రానికి ఒక నివేదికను ఇచ్చిందని, ఆ నివేదిక ఆదారంగా కేంద్రం పార్లమెంటులో చర్చించి 39 పార్టీల సపోర్ట్‌తో జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు తీర్మానం చేసిందని తెలిపారు. పార్లమెంటులో ఈ బిల్లు పాస్ అవ్వాలంటే 360 మంది పార్లమెంటు సభ్యులు అనుకూలంగా ఓటు వేస్తేనే అది సాధ్యమని, కానీ కేంద్ర ప్రభుత్వానికి అంత బలం లేదని మరి కొందరు వాదించారు. ఈ చర్చా కార్యక్రమంలో నాయకులు యూఎస్ ప్రకాస్, సత్యవరపు సంపూర్ణ, మోహన్, సుంకవల్లి వీరబద్రరావు, తుమ్మ రాంబాబు, వేముల ప్రతాప్, భారతి, బండారు చంద్రశేఖర్, గోగినపల్లి ప్రభాకర్, కానూరి మోహన్‌రావు, సుదర్శన్‌తో పాటు అధికారులు లక్ష్మీనర్సు, సీహెచ్ నర్సింహారావు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజల దృష్టి మరల్చడానికే జమిలి ఎన్నికల ప్రస్తావన

మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

చింతకాని, సెప్టెంబర్ 22: దేశ వ్యాప్తంగా ప్రజా సమస్యలను పక్కదారి మరల్చడానికే జమిలి ఎన్నికల అంశం మోడీ తెర మీదకు తీసుకువచ్చాడని, సత్వరమే సాగు నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని పందిళ్ళపల్లి గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. గత పదేళ్ళుగా కేంద్రంలోని మోదీ సర్కార్ బడ్జెట్‌లో విద్య, వైద్యం, ఉపాధి పథకానికి, వ్యవసాయ రంగానికి కోత విధించారని, దీంతో భవిష్యత్ తరాలపై ప్రభావం ఉంటుందని అన్నారు. జిల్లాలోని బీబీసీ సాగర్ ఆయకట్టు పరిధిలోని గ్రామాల్లో సాగర్ జలాలను నమ్ముకోని వరితో పాటు ఇతర పంటలు సాగుచేశారని, ప్రస్తుతం సాగునీరు లేక ఆయా పంట పోలాలు బీళ్ళు వారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, నాయకులు వత్సవా యి జానకిరాములు, ప్రసాద్, నారాయణ పాల్గొన్నారు.

తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్చొద్దు

మణుగూరు టౌన్, సెప్టెంబర్ 22: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరు మారుస్తామన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మణుగూరు ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు దోసపాటి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. బాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు తెలుగు విశ్వవిద్యాలయానికి తొలగించడం అమానుషమని అన్నారు. తెలుగు జాతి ఐక్యత కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి అసువులు బాసిన పొట్టి శ్రీరాములు లాంటి మహనీయుల చరిత్ర భావితరాలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ఆ నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.